కిషన్‌రెడ్డి, లక్ష్మణ్‌లను కలిసిన త్రిపుర గవర్నర్



త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న కిషన్‌రెడ్డి, ఉమాదేవి, కె.లక్ష్మణ్ దంపతులు

రాంనగర్/బర్కత్‌పుర, జూలై 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ నివాసాలకు త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఎన్.ఇంద్ర సేనారెడ్డి శనివారం వెళ్లి వారిని కలిశారు. బర్కత్‌పురలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని, అశోక్‌నగర్‌లో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌ను ఇంద్రసేనారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వారు ఇంద్రసేనారెడ్డికి పూలబొకే ఇచ్చి, శాలువాతో సత్కరించారు. లక్ష్మణ్ మాట్లాడుతూ తమ భేటీలో ఎలాంటి రాజకీయ ప్రాధాన్యం లేదని, సాధారణంగా కలుసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, బీజేపీ నాయకులు సారంగపాణి, నందకిషోర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్పాట్‌లోన్, క్లౌడ్ టెన్నికో యాజమాన్యాన్ని అరెస్ట్ చేయాలి

● నల్లా రాధాకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న నల్లా రాధాకృష్ణ

రాంనగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అమాయక ప్రజలను మోసం చేస్తూ కోట్లాది రూపాయలను దండుకున్న స్పాట్‌లోన్, క్లౌడ్ టెన్నికో యాజమాన్యాన్ని వెంటనే అరెస్ట్ చేయాలని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో సామాన్య బాధితుల సేవా సంఘం ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ స్పాట్‌లోన్, క్లౌడ్ టెన్నికో సంస్థలకు చెందిన ఎండీ కాకమాన రవికుమార్, జూమ్ మీటింగ్‌లు పెట్టి ప్రజలను మభ్యపెట్టిన ప్రశాంత్, పావని, హరికృష్ణ, ప్రసాద్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. 1600 రూపాయలు కడితే రూ.10 వేల నుంచి లక్షలాది రూపాయల కమిషన్‌లు వస్తాయని నమ్మించి ప్రజల నుంచి డబ్బులను దండుకున్నారని ఆరోపించారు. ఈ స్కీమ్‌లో సుమారు 10 లక్షల మంది అమాయక ప్రజలు మోసపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ స్కీమ్‌లో రూ.200 కోట్ల కుంభకోణం జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సామాన్య బాధితుల సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ మాట్లాడుతూ బ్యాంకు తరహాలో నిర్వహిస్తామని ఆన్‌లైన్ మోసాలకు పాల్పడిన ఈ కంపెనీ ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులు ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించడం సరైంది కాదన్నారు. బాధితులకు న్యాయం జరగకపోతే బీజేపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూరపాటి నాగేశ్వరరావు, సాయినోజి మనోహర, మిర్యాల రమణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుల్తాన్ యాదగిరి

హామీలను అమలు చేయాలి

● తెలంగాణ ఉద్యమకారుల సమితి చైర్మన్ యాదగిరి

రాంనగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సమితి చైర్మన్ సుల్తాన్ యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం చిక్కడపల్లిలో తెలంగాణ ఉద్యమకారుల సమితి సమావేశం బోయపల్లి రంగారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సుల్తాన్‌యాదగిరి హాజరై మాట్లాడారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇచ్చి నిర్మాణానికి నిధులు ఇవ్వాలని, గౌరవ వేతనం ప్రతి నెల రూ.30 వేలు ఇవ్వాలని, 100 ఎకరాలలో ఉద్యమకారుల స్మృతివనం ఏర్పాటు చేయాలని కోరారు. తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 15న సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తమ భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో సమితి నాయకులు ప్రఫుల్ రాంరెడ్డి, కేసీఎస్ ప్రసాద్, వెంకటస్వామి, వెంకటనారాయణ, సాయిలు, బాబు, దయానంద్, చంద్రుడు, కొండస్వామి, సంజీవ్‌రెడ్డి, డప్పుస్వామి తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రుల అభివృద్ధికి కృషి చేయాలి



మెట్టుసాయి గంగపుత్రను సన్మానిస్తున్న శ్రీహరి, మల్లయ్య సుధాకర్, బాలయ్య తదితరులు

కవాడిగూడ, జూలై 13 (ఆంధ్ర జ్యోతి): గంగపుత్రుల అభివృద్ధికి కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్‌ను తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు శ్రీహరి, యువజన విభాగం అధ్యక్షుడు మల్లయ్య సుధాకర్ గంగపుత్ర, జెడ్పీటీసీ బాలయ్య సూచించారు. నూతనంగా తెలంగాణ రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్‌గా నియమితులైన మెట్టుసాయి గంగపుత్రను తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో శాలువా కప్పి, పూలబొకే అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగపుత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో చంద్రప్రకాష్, జి.శివరత్నం, ఎర్ర బాలయ్య, ఎరబోయిన మల్లేష్, అంబటి మల్లయ్య సుధాకర్, కట్టనర్సింగ్, రవి, అవినాష్, స్వర్ణలత, సంగీత, సునిత, భారతి, పద్మ, మంజుల, లక్ష్మయ్య, గణేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత చేపపిల్లల పంపిణీ.. హర్షం

చిక్కడపల్లి, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఉచిత చేపపిల్లల పంపిణీ పథకానికి రాష్ట్రప్రభుత్వం పచ్చజెండా ఊపి, రూ.114 కోట్ల నిధులతో ప్రతిపాదనలు రూపొందించడం పట్ల తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గోరెంకల నర్సింహ, లెల్లెల బాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నాణ్యమైన మూడు అంగుళాల చేపపిల్లలు పారదర్శకంగా అన్ని కుంటలు, చెరువులు, జలాశయాలకు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

లయన్స్ సేవలు వినియోగించుకోవాలి



అల్పాహారం అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

చిక్కడపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ సేవలు అర్హులైనవారు వినియోగించుకోవాలని లయన్స్‌క్లబ్ పూర్వ డిస్ట్రిక్ట్ గవర్నర్ రఘు సూచించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ హెల్త్ సిటీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం చిక్కడపల్లిలో ఉచితంగా అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ పీఆర్‌వో డా. జీకే రమణ, శివకుమార్, లక్ష్మణ్, సత్యనారాయణ, ప్రవీణ్‌కుమార్, సాంబశివరావు, విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



పైప్‌లైన్ పనులను ఎంపీ అనిల్, ఎమ్మెల్యే గోపాల్, కార్పొరేటర్ పావనితో కలిసి ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

చిక్కడపల్లి, జూలై 13(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. గాంధీనగర్ డివిజన్ జవహర్‌స్కూల్ వద్ద రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న కచ్చానాలా పైప్‌లైన్ పనులను శనివారం ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, స్థానిక కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్‌తో కలిసి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు వినయ్‌కుమార్, ఉమేష్, పూస రాజు, సాయిచంద్, జైసింహ, రాకేష్, బంటారం యాదగిరిగౌడ్, మారిశెట్టి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

నల్లకుంట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్ న్యూనల్లకుంటకు చెందిన అజయ్‌కి ఆపరేషన్ నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ యాకర. అమృత, బీజేపీ అంబర్‌పేట నియోజకవర్గ కన్వీనర్ శ్యామ్‌రాజ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కేంద్ర మంత్రి

కవాడిగూడ, జూలై 13(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.శ్రీనివాస్ ముదిరాజ్ కూతురు స్రవంతి(21) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీతో కలిసి శనివారం శ్రీనివాస్ ముదిరాజ్ ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ముషీరాబాద్ బీజేపీ కన్వీనర్ ఎం.రమేష్‌రాం, రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఎంసీ మహేందర్‌బాబు, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

కొత్తబజార్ మెయిన్‌రోడ్ గోతులమయం

గోతుల్లోని వర్షపు నీటిలో వరినాటి నిరసన తెలిపిన కాంగ్రెస్ నేత



మెయిన్‌రోడ్‌పై నిలిచిన వర్షపు నీటిలో వరినాటి నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకుడు ప్రవీణ్ తదితరులు

కవాడిగూడ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ కొత్త బజార్ రోడ్ గోతులమయంగా మారింది. రోడ్డుకు మరమ్మతులు చేయక పోవడాన్ని నిరసిస్తూ రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలో వరినాటి కాంగ్రెస్ కవాడిగూడ డివిజన్ నాయకుడు ఆకుల ప్రవీణ్ శనివారం వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోతులమయంగా మారిన రోడ్డుపై వర్షం పడిన ప్రతిసారీ మోకాళ్లలోతు నీరు నిలిచి ఉండటంతో వాహనదారులు. పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ రచనశ్రీకి స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు. అధికారులు స్పందించి గోతుల మయంగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆకుల ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని 6న చలో ఢిల్లీ

● రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య



సమావేశంలో అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, గువ్వల భరత్‌కుమార్ తదితరులు

బర్కత్‌పుర, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బీసీల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 6న చలో ఢిల్లీ పార్లమెంట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటక, ఉత్తరప్రదేశ్, హరియాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున బీసీ సంఘాల ప్రతినిధులు వేలాదిగా ఢిల్లీకి తరలివస్తున్నారని తెలిపారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షుడు గువ్వల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో బీసీ సంఘాల కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం దిగివచ్చే వరకు బీసీల పోరాటం ఆగదన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, క్రిమీలేయర్‌ను రద్దు చేయాలని, విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను 56 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ రంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని, కేంద్రంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మాదిరిగా బీసీలకు సామాజిక రక్షణ భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు ప్రవీణ్ ముదిరాజ్, జి.అనంతయ్య, సతీష్, నాగరాజు, శ్రీధర్, రోహిత్, ప్రణీత, ఉదయ్, మల్లికార్జున్, బి.పవన్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచడం గొప్ప విషయం

● హైదరాబాద్ డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్



కార్యక్రమానికి హాజరైన అతిథులతో ఆకర్షణ సతీష్

పద్మారావునగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో పుస్తక పఠన ఆసక్తిని పెంపొందించడానికి హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ఆకర్షణ సతీష్ చేస్తున్న కృషి అభినందనీయమని హైదరాబాద్ డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్ అన్నారు. బోయగూడలోని నవజీవన అనాథ బాలికల హాస్టల్‌లో ఆకర్షణ వారి తల్లిదండ్రుల సహకారంతో ఏర్పాటుచేసిన ఓపెన్ లైబ్రరీని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.. అతిచిన్న వయసులోనే ఆకర్షణ ఒక సంఘటన ద్వారా స్ఫూర్తి పొంది వేల పుస్తకాలను సేకరించి తెలుగు రాష్ట్రాలతో పాటుగా తమిళనాడులో అనేక లైబ్రరీలను ఏర్పాటుచేయడం గొప్ప విషయమని అన్నారు. ఆమె చేస్తున్న సేవలకు గుర్తింపుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ వంటి ప్రముఖులు ఆమెను అభినందించారని, ఈ లైబ్రరీని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆకర్షణ తండ్రి సతీష్‌కుమార్ మాట్లాడుతూ... కోవిడ్ వంటి ప్రాణాంతక వ్యాధి ప్రబలుతున్న 2021వ సంవత్సరంలో ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిలో రోగులకు ఆహారం అందిస్తున్న సమయంలో ఓ రోగి తనకు కాలక్షేపానికి పుస్తకాలు కావాలని అడగడంతో తన కూతురుకు కలిగిన ఆలోచనకు ప్రతిరూపమే ఓపెన్ లైబ్రరీల ఏర్పాటు అని ఆయన తెలిపారు. ఇప్పటి వరకు వివిధ ప్రాంతాలలో 14 లైబ్రరీలను ఏర్పాటు చేశామని, అపార్టుమెంటువాసులు, స్నేహితులు బంధువుల నుంచి ఇప్పటి వరకు దాదాపుగా 9 వేల పుస్తకాలను సేకరించామని పేర్కొన్నారు. తన కుమార్తె చేస్తున్న సేవలను గుర్తించిన ప్రధాని మోదీ ఈ విషయాన్ని సెప్టెంబర్ 24, 2023 మన్‌కి బాత్ 105వ ఎపిసోడ్‌లో ప్రస్తావించారని, భవిష్యత్‌లో 25వ లైబ్రరీ ప్రారంభోత్సవానికి స్వయంగా హాజరవుతానని ప్రధాని మాటిచ్చారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు తస్నీరు ప్రమోద, విజయభాస్కర్, సయ్యద్ నబీ, జీవిత, హైదరాబాద్ యూనిసెఫ్ ప్రోగ్రామ్ మేనేజర్ డేవిడ్‌రాజ్, ఇఫ్లూ రిటైర్డ్ ప్రొఫెషనల్ అసిస్టెంట్ (లైబ్రరీ) టీవీ ప్రఫుల్లా చంద్ర, బాలికలు, నన్స్, సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న చంద్రశేఖర్

మహిళా కండక్టర్లకు సెకండ్‌షిఫ్ట్ డ్యూటీలు వద్దు

● ఎస్‌డబ్ల్యూయూఐఎన్‌టీయూసీ

హైదరాబాద్‌సిటీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో మహిళా కండక్టర్లకు సెకండ్‌షిఫ్ట్ డ్యూటీలు నిలిపివేయాలని ఎస్‌డబ్ల్యూయూ ఐఎన్‌టీయూసీ జాతీయ ప్రధానకార్యదర్శి ఆర్‌డీ.చంద్రశేఖర్ అన్నారు. ఎస్‌డబ్ల్యూ యూఐఎన్‌టీయూసీ మహిళా విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ ఆర్టీసీ మహిళా కండక్టర్ల సదస్సును శనివారం నిర్వహించారు. సదస్సులో మహిళా కండక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో మహిళా కండక్టర్ల పాత్ర చాలా ప్రధానమైందన్నారు. ప్రధాన కార్యదర్శి అబ్రహం మాట్లాడుతూ చిన్నచిన్న కేసుల్లో మహిళా కండక్టర్లను సస్పెండ్ చేయవద్దని సూచించారు. కొంతమంది అధికారులు మహిళా కండక్టర్లకు కష్టమైన డ్యూటీలేవేస్తూ వేధిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సునీల్ శ్రీబెన్ సుశీల్, జక్కుల మల్లేష్, ఆఫీస్‌ఖాన్, సుధాకర్, ఎల్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'వీఆర్‌వోలను రెవెన్యూ శాఖలో చేరుస్తూ చట్టం చేయాలి'

రాంనగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం రెవెన్యూ శాఖ నుంచి తొలగించిన వీఆర్‌వోలను తిరిగి అదే శాఖలో చేర్చే అంశాన్ని త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలకు వీఆర్‌వోల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్‌రావు, హైదరాబాద్ అధ్యక్షుడు కె.విజయరావు విజ్ఞప్తి చేశారు. శనివారం వారు రాంనగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యేలు అందరూ వీఆర్‌వోల సమస్యలపై చర్చించి తమ డిమాండ్ల సాధనకు తోడ్పాటునందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్, పి.విజయ్‌కుమార్, పాకరాజు, కె.రాజు, ఎ.కృష్ణంరాజు, కాంగ్రెస్ నాయకుడు కెనెడిరాజు, అభిషేక్ కెనెడి తదితరులు పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన భర్తకు రిమాండ్



నిందితుడు ప్రదీప్ బోలా

ఉప్పల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): భార్యను కిరాతకంగా హత్య చేసి గోనె సంచిలో పెట్టి పారిపోయిన భర్తను ఉప్పల్ పోలీసులు అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఒరిస్సా కేంద్రపరా జిల్లా అయభ గ్రామానికి చెందిన ప్రదీప్‌బోలా(32), మధుమిత(24)లకు 2019లో వివాహం జరిగింది. మూడు నెలల కాపురం అనంతరం జీవనోపాధి కోసం భార్యాభర్తలు ఇద్దరు కలిసి హైదరాబాద్‌లోని ఉప్పల్ న్యూభరత్‌నగర్‌లో ఉంటున్నారు. తర్వాత మధుమిత గర్భవతి కావడంతో ఒరిస్సాలోని ఆమె తల్లిదండ్రుల ఇంటి వద్ద వదిలిపెట్టి తిరిగి హైదరాబాద్‌కు వచ్చాడు. మధుమితకు కుమార్తె పుట్టిన తర్వాత ప్రదీప్‌బోలా భార్య, కుమార్తెను చూసేందుకు వెళ్లలేదు. దీంతో మధుమిత కేంద్రపరా పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం గ్రామ పెద్ద సమక్షంలో రాజీ కుదుర్చుకున్న ప్రదీప్ తన వెంట మధుమితను హైదరాబాద్‌కు తీసుకొచ్చాడు. ఆ తర్వాత కూడా తరుచూ దంపతులిద్దరి మధ్య చీటికి మాటికి గొడవలు కొనసాగాయి. ఈనెల 7న ఉదయం ఇద్దరి మధ్య వివాదం ముదరడంతో ప్రదీప్ రొట్టెలు చేసే పీటతో మధుమిత తలపై బాదాడు. దీంతో ఆమె కింద పడిపోయింది. వెంటనే చున్నీని మెడకు చుట్టి చంపాడు. తర్వాత మృతదేహాన్ని సంచిలో కుక్కి బాత్‌రూమ్‌లో పెట్టి ఇంటికి తాళం వేసి కుమార్తెను తీసుకొని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు పారిపోయాడు. అక్కడ ఒక వ్యక్తికి ఇప్పుడే వాష్‌రూమ్‌కు పోయి వస్తానని చెప్పి తన చేతిలోని పాపను ఇచ్చి పారిపోయాడు. ప్రదీప్ ఎంతకు రాకపోవడంతో పాపను రైల్వే పోలీసుల సహాయంతో చైల్డ్ హోమ్‌కు అప్పగించారు. అయితే, పారిపోయిన ప్రదీప్ తనకు తెలిసిన వ్యక్తి ద్వారా బేగంపేటలోని హోటల్‌లో పని చేస్తున్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గతంలో పని చేసిన హోటల్ యజమాని ఇచ్చిన సమాచారంతో నిందితుడిని బేగంపేటలో అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటపెట్టాడు. దీంతో అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

రిసాలగడ్డలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



రిసాలగడ్డలో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కె.రవిచారి

రాంనగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని రిసాలగడ్డలో డ్రైనేజీ సమస్యను జలమండలి అధికారులు సత్వరమే పరిష్కరించాలని కార్పొరేటర్ కె.రవిచారి సూచించారు. శనివారం స్థానికులతో కలిసి ఆయన రిసాలగడ్డ ప్రాంతంలో పాదయాత్ర చేసి సమస్యను తెలుసుకున్నారు. డ్రైనేజీ, కలుషిత నీటి సమస్యలను స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన కార్పొరేటర్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని చిలకలగూడ డీజీఎం మోహన్‌రావు, మేనేజర్ శివసాయిలకు ఫోన్ చేసి సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు వాహేద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్‌లో కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలి



శాంతినగర్‌లో సమస్యలను తెలుసుకుంటున్న మాజీ కార్పొరేటర్ వెంకటరెడ్డి

రాంనగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని శాంతినగర్‌లో కలుషిత నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి డీడీ కాలనీ వాటర్ వర్క్స్ సెక్షన్ అధికారులకు సూచించారు. శనివారం శాంతినగర్‌లో ఆయన పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి వర్క్ సూపర్‌వైజర్ బాలకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు మిరియాల శ్రీనివాస్, అర్జున్ స్థానికులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ కంప్యూటర్ కోర్సులలో శిక్షణ

రాంనగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వ సర్టిఫైడ్ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ ఆన్‌లైన్ కోర్సుల శిక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ సాయి శ్రీమాన్‌రెడ్డి తెలిపారు. శనివారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రోగ్రాం ఇంటర్‌పాస్, ఎంసెట్ పాస్, ఇంజనీరింగ్‌లో చేరే విద్యార్థులు. డిగ్రీ, పీజీ పాలిటెక్నిక్ డిప్లొమా చేస్తున్న అభ్యర్థులు, ఇంజనీరింగ్ చేస్తున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డేటా సర్వీస్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటరింగ్, సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హాకింగ్, పైథాన్, మిషన్ లెర్నింగ్, బిజినెస్ అనలటిక్స్ తదితర 50కి పైగా కోర్సులు ఉన్నాయని తెలిపారు. బీసీ, ఎస్సీ ఎస్టీ, ఈబీసీ, ఓబీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన దివ్యాంగులకు, మహిళా అభ్యర్థులకు, మాజీ సైనికులకు, వారి పిల్లలకు స్వర్ణ భారత్ జాతీయ స్థాయి నైపుణ్య అభివృద్ధి కార్యక్రమం ద్వారా 80శాతం ఫీజు తగ్గింపుతో ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నేషనల్ స్కిల్ అకాడమీ.ఇన్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఫోన్ నం.9505800050, 9505800047లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గోపాల్ మృతి

● నివాళులు అర్పించిన ప్రముఖులు



గోపాల్ (ఫైల్)

ముషీరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ గంగపుత్ర కాలనీకి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, వీఎస్‌టీ కంపెనీ యూనియన్ మాజీ నాయకుడు పూస గోపాల్(77) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. చిన్న కుమారుడు పూస గోరక్‌నాథ్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెల్యే ముఖ్యఅనుచరుడు. పూసగోపాల్ మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఎంపీలు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, కార్పొరేటర్లు సుప్రియా నవీన్‌గౌడ్, రవిచారి, మాజీ కార్పొరేటర్ ఎడ్ల భాగ్యలక్ష్మి హరిబాబు యాదవ్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, ముషీరాబాద్ గంగపుత్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చెరక జగన్, నవీన్ తదితరులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి ధైర్యం చెప్పారు. ఆయన అంత్యక్రియలు పార్శిగుట్టలోని గంగపుత్ర సంఘం శ్మశానవాటికలో నిర్వహించారు. అంతిమ యాత్రలో బీఆర్ఎస్ నాయకులు డి.శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, ఎయిర్‌టెల్‌రాజు, శ్రీధర్ రెడ్డి, ఆకుల అరుణ్ కుమార్, ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్ యాదవ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జమాల్‌పురి నందు, బిజ్జి రవి తదితరులు పాల్గొన్నారు.

అశ్రితకు భారతీయ ప్రతిభా పురస్కారం ప్రదానం



నగరంలోని లలితాకళాతోరణంలో ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం జరిగిన భారతీయ లలిత కళాఉత్సవంలో భారతీయ ప్రతిభా పురస్కారాన్ని ఇండో కెనెడియన్ యూత్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షురాలు రోయ్యూరి అశ్రితకు కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, సంస్థ అధ్యక్షుడు అద్దంకి రాజా అందజేశారు.

- రాంనగర్, జూలై 13(ఆంధ్రజ్యోతి)

చెట్ల కొమ్మల తొలగింపు




గోల్నాక డివిజన్ నింబోలిఅడ్డ ప్రాంతంలో విద్యుత్ వైర్లకు తాకుతున్న చెట్ల కొమ్మలను శనివారం జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కొట్టేపిస్తున్న బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, బీజేపీ నాయకులు కేసరి నర్సింగ్‌రావు యాదవ్, ఆర్‌వీఎల్ రమేష్, ఎ.సురేందర్, ఎస్.నవీన్‌కుమార్ తదితరులు

- గోల్నాక, జూలై 13 (ఆంధ్రజ్యోతి)

రైలు ప్రయాణికురాలి బంగారు ఆభరణాల చోరీ

బర్కత్‌పుర, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికురాలి 11 తులాల బంగారు ఆభరణాలను దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని బంజారాహిల్స్‌కు చెందిన కంచర్ల కవిత (50) తన ఐదుగురు స్నేహితురాళ్లతో కలిసి షిరిడీ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో అజంతా ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి కాచిగూడకు వస్తుండగా మహారాష్ట్రలోని పూర్ణ రైల్వే స్టేషన్ వద్ద హ్యాండ్ బ్యాగ్ కనిపించలేదు. దానిలో 11 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయి. శనివారం కవిత కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ కోసం నాందేడ్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు.

యువతి అదృశ్యం



వైష్ణవి

రాంనగర్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకు అని వెళ్లిన యువతి అదృశ్యమైంది. నల్లకుంట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లకుంటలోని బాయమ్మగల్లీలో నివాసం ఉంటున్న ఎం.శ్యామ్‌కుమార్, మంజుల కుమార్తె వైష్ణవి(21) దూరవిద్యలో డిగ్రీ చేస్తుంది. బేగంపేటలోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకని శుక్రవారం వెళ్లింది. ఇంటర్వ్యూ మధ్యాహ్నం 12 గంటలకు పూర్తయింది. ఆ తర్వాత ఆమె ఫోన్ స్విచాఫ్ అయింది. ఆమె ఆచూకీ లభించకపోవడంతో తల్లి మంజుల శనివారం నల్లకుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.